www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 5 నవంబరు 2022
5
పశ్చిమ గోదావరి



లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 12వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉదయం 10:30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఐదు కోర్టుల పరిధిలోని ఐదు బెంచుల్లో కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు.

ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మూడో అదనపు జిల్లా జడ్జి మండల న్యాయ సేవా అధికారి కమిటీ ఛైర్మన్, న్యాయమూర్తి పి.సత్యదేవి కోరారు. శుక్రవారం స్థానిక మూడో అదనపు జిల్లా కోర్టులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సత్య దేవి మాట్లాడుతూ ఆయా కోర్టుల పరిధిలో 5,658 కేసులు పెండింగ్‌లో ఉండగా, 1169 కేసులు రాజీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఒకటో అదనపు జూనియర్ సివిల్ జెడ్జి ఎ.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

'కొల్లేరు'లో రెగ్యులేటర్లు కట్టేనా..!

- రూ.412 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటనలే
- మూడుచోట్ల రెగ్యులేటర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- ఇప్పటికీ కనీసం శంకుస్థాపన చేయని పరిస్థితి
- కొల్లేరులోకి ఎగదన్నుతున్న ఉప్పు నీరు
- కాగితాలు.. మాటల్లోనే కొల్లేరు పర్యాటక అభివృద్ధి



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'కొల్లేరును అభివృద్ధి చేస్తాం.. అక్కడి ప్రజలను ఆదుకుంటాం. కొల్లేరు కలుషితం కాకుండా రెగ్యులేటర్ల నిర్మాణం చేపడతాం' అని ప్రభుత్వం చెబుతున్న మాటలు కాగితాలకే పరిమితమయ్యాయి. కొల్లేరులో అతిముఖ్యమైన రెగ్యులేటర్ల నిర్మాణంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది. సముద్రపు ఉప్పునీరు కొల్లేరుకు ఎగదన్నడంతో కొల్లేరు సరస్సు కాలుష్యకారకంగా మారుతోంది. మత్స్య జాతులు సైతం అంతరించిపోతున్నాయి. దీంతో రెగ్యులేటర్ల నిర్మాణంతో ఉప్పునీరు కొల్లేరులోకి రాకుండా అడ్డుకునేందుకు ప్రణాళికలు తయారు చేశారు. రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టేస్తున్నామంటూ వైసిపి ప్రభుత్వం మూడేళ్లుగా ఊరిస్తూనే ఉంది. ఇప్పటి వరకూ కనీసం శంకుస్థాపన సైతం చేయకపోవడం గమనార్హం. ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం పడితడక, కృష్ణా జిల్లాలోని మోళ్లపర్రు సమీపాన మొత్తం మూడు రెగ్యులేటర్లు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం రూ.412 కోట్ల నిధులకు సంబంధించి ఉత్తర్వులు సైతం జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఈ ఏడాది మే 16న గణపవరంలో జరిగిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి జూన్‌లో రెగ్యులేటర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. స్వయంగా సిఎం ప్రకటించినప్పటికీ రెగ్యులేటర్ల నిర్మాణం అతీగతీ లేకుండా పోయింది. వైసిపి అధికారంలోకొచ్చి మూడేళ్లు దాటిపోయింది. అయినప్పటికీ రెగ్యులేటర్ల నిర్మాణం మాత్రం కాగితాలకే పరిమితమైంది. కొల్లేరుకు సంబంధించిన ఏ హామీనీ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదు.

కొల్లేరులో అభివృది ఏదీ..?

కొల్లేరును పర్యాటక రంగంలో అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం నుంచి అధికారుల వరకూ ప్రకటనలు గుప్పించడం మినహా కార్యాచరణ మాత్రం లేకుండాపోయింది. 2006లో 'ఆపరేషన్ కొల్లేరు' పేరుతో చేపల చెరువులన్నింటినీ బాంబులు పెట్టి పేల్చేశారు. జిరాయతీ భూముల్లోని చేపల చెరువులను సైతం ధ్వంసం చేసేశారు. ఏఒక్క రైతుకూ పరిహారం మాత్రం ఇవ్వలేదు. అప్పటి నుంచి కొల్లేరు ప్రాంత ప్రజలు వలస పక్షుల్లా మారి బతుకులు నెట్టుకొస్తున్నారు. కొల్లేరును పర్యాటక రంగంలో అభివృద్ధి చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయి. కేరళ తరహాలో బోటు ప్రయాణాలు వంటి ఏర్పాటు చేయడం, ఆటపాక పక్షుల కేంద్రాన్ని మరింతగా తీర్చిదిద్దడం, రిసార్టులు ఏర్పాటు చేయడం వంటివి చేస్తే కొల్లేరు పర్యాటక రంగంలో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అది జరిగితే స్థానిక ప్రజానీకానికి ఉపాధి దొరుకుతోంది. ప్రభుత్వం మాటల్లో తప్ప చేతల్లో కొల్లేరును పట్టించుకోని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ధ్వంసం చేసిన జిరాయతీ భూములను అప్పగించాలని, కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలనే డిమాండ్లపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. భూముల రీసర్వే నిర్వహించి కొల్లేరులో జిరాయతీ భూములను అక్కడి ప్రజలకు అప్పగిస్తామని చెబుతున్నప్పటికీ చేతల్లో మాత్రం అడుగు ముందుకు పడటం లేదు. ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తే పది వేల ఎకరాల భూమి రైతులకు అందనున్నట్లు స్థానిక ప్రజానీకం చెబుతున్నారు. రెగ్యుటేర్ల నిర్మాణం నుంచి పర్యాటక అభివృద్ధి, భూముల రీసర్వే ఏ ఒక్కటీ ప్రభుత్వం చేపట్టకుండా కాలయాపన చేస్తోంది. కొల్లేరు నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు సైతం అదిగో.. ఇదిగో అనడం మినహా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో విఫలమయ్యారనే విమర్శలు విన్పిస్తున్నాయి

మార్పులపై ప్లాన్ తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

నాడు-నేడు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చేస్తున్న మార్పులపై ప్లాన్ తప్పనిసరిగా ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. స్థానిక జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో నాడు-నేడు పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి మాట్లాడారు. అందుబాటులో ఉన్న నిధులను సక్రమంగా వినియోగించి ప్రణాళికబద్ధంగా పనులను పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు కింద చేపట్టిన పనులకు సంబంధించి పాఠశాలలు, కళాశాలలో ఏయే మార్పులు చేస్తున్నారు, వాటి స్థానంలో ఏయే నిర్మాణాలు చేపడుతున్నారు తెలిపేలా స్కూలు మొత్తానికి ప్లాన్ తయారుచేసి ప్రదర్శించాలన్నారు. 50 రోజుల్లోపుగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో నాబార్డ్ నిధులతో చేపట్టిన 14 పాఠశాలలో 12 పాఠశాల నిర్మాణాలు పూర్తయ్యాయని, ఇంకా పూర్తి చేయాల్సిన కాళ్ల, ఉండి గ్రామాల్లోని పాఠశాలలను కూడా మిగిలిన నిధులతో పూర్తి చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టకపోతే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఇఒ ఆర్‌వి రమణ, ఎస్ఎస్‌వై ప్రాజెక్టు అధికారి పి.శ్యాంసుందర్, ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ఇ ఎఎస్ఎ రామస్వామి, పబ్లిక్ హెల్త్ ఇఇ విజయ రామవత్, పంచాయతీ రాజ్ డిఇ అన్నపూర్ణ, ఎస్ఎస్‌వై డిఇఇ బి.హెచ్ శక్తేశ్వరరావు పాల్గొన్నారు.

సి క్లాస్ భూములపై సమగ్ర నివేదికివ్వాలి



అధికారులతో సమీక్షిస్తున్న జెసి మురళీ

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

సి క్లాస్ భూములపై ప్రస్తుత వాస్తవిక పరిస్థితులపై సమగ్ర నివేదన అందజేయాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టరు జెవి.మురళి ఆదేశించారు. శుక్రవారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం సబ్ కలెక్టరు ఛాంబరులో నరసాపురం, యలమంచిలి, పెనుగొండ, ఆచంట మండలాలు గోదావరి పరివాహక ప్రాంతాల భూములపై జెసి సమీక్షా సమావేశం నిర్వహించారు. గోదావరి పరివాహక ప్రాంత భూముల రికార్డులు, ఎంజాయిమెంటు సర్వే వివరాలు ఆయన పరిశీలించారు. ఆయా భూముల్లో నివసించే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సి క్లాస్ భూములు ఎక్కడ నుండి ఎక్కడ వరకూ ఉన్నాయో మండలాల వారీగా అడిగి తెలుసుకుని ఆయా రికార్డులు, మ్యాప్‌లు పరిశీలించి, ఇందుకు సంబంధించిన వివరాలను అధికారులను జెసి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఎడి జాషువా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రాంబాబు, నాలుగు మండలాల తహశీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు

బాలికలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్

ఐద్వా ఆధ్వర్యంలో ఇటుకుల గుంటలో బాలికలపై జరిగే అత్యాచారాలకు వ్యతిరేకంగా శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ బాలికలకు రక్షణ కరువైందన్నారు. ఇంటిలో ఉన్న బిడ్డకు కూడా రక్షణ లేదని, బాలికలను బంధువులు, చుట్టుపక్కల వారు అత్యాచారాలు, అఘాయిత్యాలు చేస్తున్నారని తెలిపారు. ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన సరిగ్గా అమలు జరపకపోవడం వల్ల నిర్భయంగా దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ దాడులను అరికట్టాల్సిన ప్రభుత్వాలు మద్యం వల్ల ఆదాయం తగ్గింది ఇంకా జనంతో బాగా తాగించండని చెప్పడం బాధాకరమని తెలిపారు. మద్యం మత్తులో విద్యార్థులపై, బాలికలపై దాడులు, అత్యాచారాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. బాలికలపై అత్యాచారాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలు పూరి సత్యవతి, పి.వెంకాయమ్మ, పి.వెంకట నాగమణి, పి.సత్యవతి, కొండపల్లి పద్మావతి, పి.వీరమణి, జి.కోట సత్యవతి, జి.వెంకటలక్ష్మి, ఎం.సుబ్బలక్ష్మి, రూప పాల్గొన్నారు.

తోటి విద్యార్థుల దాడిలో ఒకరికి గాయాలు

ప్రేమ వ్యవహారమే కారణమా..!

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వారంతా ఒకే కళాశాలలో చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు. అందరూ దూరప్రాంతాల నుంచి వచ్చి హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నవారే. అయితే కలిసిమెలిసి ఉండాల్సిన వారు రౌడీల్లా వ్యవహరించి ప్రేమ వ్యవహారంలో తోటి విద్యార్థిపై కర్రలతో, ఇస్త్రీ పెట్టెతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ సంఘటనతో ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం నివ్వెరబోయింది. చివరకు ఆ ఐదుగురు విద్యార్థులను సస్పెండ్ చేశారు. దీనికి సంబంధించి భీమవరం టూటౌన్ సిఐ కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం. నరసన్నపేటకు చెందిన బోయిన అంకిత్ అనే విద్యార్థి ప్రముఖ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతూ చిన అమిరంలోని నరేష్ హాస్టల్‌లో ఉంటున్నాడు. అయితే అదే కళాశాలకు చెందిన ప్రవీణ్, ప్రేమ్, స్వరూప్, నీరజ్ నలుగురు విద్యార్థులు కూడా హాస్టల్‌లో ఉంటున్నారు. వీరి మధ్య ఒక యువతి గురించి విభేదాలు తలెత్తాయి. దీంతో ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రవీణ్, ప్రేమ్, స్వరూప్, నీరజ్ అంకిత్ వద్దకు వెళ్లి కర్రలతో దాడి చేసి, ఇస్త్రీ పెట్టెతో కాల్చి గాయపర్చారు. తీవ్ర గాయాలతో ఉన్న అంకిత్‌ను తోటి విద్యార్థులు భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. దీనిపై సమాచారం అందుకున్న టూటౌన్ సిఐ కృష్ణకుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దీనిపై జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ నలుగురు విద్యార్థులపై 307 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌సి తెలిపారు. కళాశాల యాజమాన్యం కూడా ఐదుగురు విద్యార్థులను సస్పెండ్ చేసినట్లు ప్రకటించినట్లు సమాచారం.



దాడిలో గాయపడిన విద్యార్థి

రూ.20 లక్షలతో డ్రెయినేజీల నిర్మాణం : పివిఎల్

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరులో రూ.20 లక్షలతో డ్రెయినేజీల నిర్మాణం చేయనున్నట్లు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నర్సింహరాజు అన్నారు. పాలకోడేరులో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ గ్రామంలో ఏ గడపకు వెళ్లినా సంక్షేమ పథకాలు తీసుకున్న కుటుంబాలు చిరునవ్వుతో ఎదురొచ్చి స్వాగతం పలుకుతున్నాయన్నారు. గ్రామంలో ప్రధానంగా డ్రెయినేజీ సమస్య ఉందని, వాటి పరిష్కారానికి రూ.20 లక్షలతో నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), పాలకోడేరు సర్పంచి ఇంజేటి మరియమ్మ, ఉప సర్పంచి దెందుకూరు వెంకటరాజు, ఎంపిటిసిలు నాగలక్ష్మి, స్వాతి, కాటూరి శాంతకుమారి, పాల జ్యోతి, లక్ష్మీ తులసి, నాయకులు కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, దుండి అశోక్, శ్రీనివాసరాజు, నాగేశ్వరరావు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఆర్ఐ నాగభూషణరావు పాల్గొన్నారు.



వికలాంగుడికి బ్రోచర్ అందిస్తున్న డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

మొగల్తూరులో వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలో శుక్రవారం మధ్యాహ్నం వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ కాసినా ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో వర్షం పడింది. ఒక పక్క ఎండ అంతలోనే వర్షం పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రహదారులపై నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



జిల్లా కలెక్టర్‌ను సత్కరిస్తున్న సభ్యులు

మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వానికి నివేదిక

ప్రజాశక్తి - భీమవరం

మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా సైనిక్ బోర్డు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో వాచ్‌మెన్ పోస్టుల భర్తీకి మాజీ సైనికులకు అవకాశం కల్పించాలన్నారు. ఔటొసోర్సింగ్ పోస్ట్‌ల్లో ప్రయివేటు ఏజెన్సీలు భర్తీ చేసేటప్పుడు 5 శాతం మాజీ సైనికులకు రిజర్వేషన్ విధిగా అమలు చేయాలని ఆదేశించారు. ఎక్స్ సర్వీస్ మెన్‌లకు ఇచ్చిన భూములకు సంబంధించి సమస్యల వివరాలు అందించినట్లయితే తహశీల్దార్ ద్వారా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. అర్హత కలిగిన యుద్ధ వితంతువులకు 300 చదరపు గజాల ఇంటి స్థలం ఇస్తామని తెలిపారు. సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ పెట్టుకోవడానికి ఎవరైనా ముందుకొస్తే శిక్షణ ఇచ్చి రుణాలు మంజూరు చేస్తామన్నారు. కలెక్టరేట్‌లో ఎక్స్ సర్వీస్ మాన్‌ల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. బోర్డుతో సంబంధం లేకుండా మాజీ సైనికుల సమస్యలు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ మేజర్ జనరల్ బొల్లిన వెంకట్రావు, పివిఎస్ఎం, విఎస్ఎం, డిఆర్ఒ దాసి రాజు, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి సాయిప్రసాదరావు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

భీమవరం :ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని సమవర్థవంతంగా అమలు చేయాలని, దీనికి వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్యశ్రీ పథకాలపై వైద్య అధికారులతో సమీక్షించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్యాధికారి, మిగిలిన బృందం గ్రామీణ ప్రాంతాల్లో నెలలో రెండుసార్లు సందర్శిస్తారని తెలిపారు. అక్కడ చేసే చికిత్సలతో పాటు ఆరోగ్యశ్రీ సేవలపైన సమన్వయం చేస్తారని తెలిపారు. ఆయుష్మాన్ భారత్, డిజిటల్ మిషన్‌లో భాగంగా అర్హులైన పేదవారికి డిజిటల్ హెల్త్ ఐడి ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అక్టోబర్ 31న లాంచనంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 19 మండలాల్లో 209 క్యాంపులు నిర్వహించి 11,534 మందిని పరీక్షించామన్నారు. సమావేశంలో డిఎంఅండ్‌హెచ్ఒ డి.మహేశ్వరరావు, అడిషనల్ డిఎం అండ్‌హెచ్ఒ భాను నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవసుధ, భీమవరం నరసాపురం డిప్యూటీ డిఎంహెచ్ఒలు సుగుణేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన సీడ్, ఫీడ్ అందించాలి

పెదఅమిరంలో అంతర్జాతీయ ఆక్వాఎక్స్‌పో ప్రదర్శన

ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వా వ్యాపారులు రైతులకు నాణ్యమైన సీడ్, ఫీడ్ అందిస్తే నాణ్యమైన ఉత్పత్తులు సాధిస్తూ ఆక్వారంగం అభివృద్ధి పథంలో పయనిస్తుందని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి అన్నారు. పెదఅమిరంలో రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్లో అంతర్జాతీయ ఆక్వా ఎక్స్పో ప్రదర్శనను రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు, ఎంఎల్ఎ మంతెన రామరాజు శుక్రవారం ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన నిర్వహించి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంవిఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఆక్వా రంగం ఒడిదుడులతో సాగుతోందన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలన్నారు. ఆక్వాలో శాస్త్రవేత్తల సలహాలతో సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన పంటలు పండించొచ్చున్నారు. హేచరీల్లో నాణ్యమైన సీడ్ లభించినప్పుడే నాణ్యమైన రొయ్య, చేపల ఉత్పత్తులు సాధించవచ్చున్నారు. ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ ఆక్వా సాగులో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి దిగుబడి పెంచేందుకు అనుసరించాల్సిన ఆధునిక విధానాలపై ఆక్వా అంతర్జాతీయ ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆక్వా రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ ఇండియన్ ఫిషరీస్ ఐసిఎఆర్ బిపి.మహంతి, న్యూఢిల్లీ ఎడిజి డాక్టర్ వివి సుగ్మాన్ ఫర్దర్, కొచ్చిన్ అడిషనల్ డెవలప్మెంట్ కమిషనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.




ప్రదర్శనకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాగిరెడ్డి, ఎంఎల్ఎ

శ్మశానవాటికలో గొడౌన్ నిర్మించొద్దు

ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజుకు వినతి

ప్రజాశక్తి - పాలకోడేరు

అయిదు పేటలకు చెందిన వారంతా ఒకే శ్మశానవాటికను వినియోగించుకుంటున్నాం. భవిష్యత్ తరాలకు ఈ శ్మశానవాటికే ప్రధాన ఆధారం, తమ శ్మశానవాటికలో ఎటువంటి గొడౌన్ నిర్మించొద్దంటూ శృంగవృక్షం గ్రామ పరిధిలోని తాడి, ఉండ్రు, సబ్బితి, పాలపర్తి, రాయిపేటలకు చెందిన దళితులు ఇన్‌ఛార్జి డిఆర్ఒ, ఆర్‌డిఒ దాసి రాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐదు పేటలకు చెందిన పల్లెం భీమన్న, ఉండ్రురాజు, బొంద చంద్రశేఖర్, మంగం రాజుబాబు, పాలపర్తి బాబ్జీ శ్మశానవాటిక సమస్యను జిల్లా ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజు దృష్టికి తీసుకెళ్లారు. అయిదు పేటలకు చెందిన కొంత శ్మశానవాటిక భూమి ఉందని, మా తాత ముత్తాతల నుంచి ఎవరైనా చనిపోతే ఈ శ్మశాన వాటికలోనే ఖననం చేస్తున్నామని తెలిపారు. కరోనా సమయంలో శ్మశానవాటికలో డంపింగ్ యార్డు నిర్మాణం చేస్తామని అధికారులు చెప్పడంతో అప్పట్లో తామంతా వ్యతిరేకించామన్నారు. ప్రస్తుతం అదే శ్మశానవాటికలో గొడౌన్ నిర్మిస్తామని అధికారులు చెబుతున్నారని తెలిపారు. అదే జరిగితే తమ ఐదు పేటల భవిష్యత్ తరాల వారికి శ్మశానవాటిక ఉండదని తెలిపారు. ఈ గొడౌన్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ ఇప్పటికే తహశీల్దార్‌కు, మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, శృంగవృక్షం గ్రామ పంచాయతీ అధికారికి, శృంగవృక్షం సొసైటీ ఛైర్మన్‌కు వినతపత్రాలు అందజేశామని తెలిపారు. శ్మశానవాటికలో గొడౌన్ నిర్మిస్తే భవిష్యత్తులో ఎవరైనా చనిపోతే ఖననం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపారు. ఈ చర్యలను నిలుపుదల చేయాలని కోరారు. దీనిపై ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజు మాట్లాడుతూ శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



ఇన్‌ఛార్జి డిఆర్ఒ దాసి రాజుకు వినతిపత్రం అందిస్తున్న దళితులు

లబ్ధిదారుల జాబితాను నోటీసు బోర్డులో ఉంచాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ సంక్షేమ పథకాల వారీగా లబ్ధిదారుల జాబితాలను ప్రతి వార్డు సచివాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించాలని జిల్లా జాయింటు కలెక్టరు జెవి మురళి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నరసాపురం మున్సిపాల్టీలోని మృత్యుంజయనగర్, పీచుపాలెం, అధికారివారి వీధి, టైలర్ పేట, గాంధీనగర్ సచివాలయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నోటీసు బోర్డును, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, సిబ్బంది చేస్తున్న పనులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సేవలను నిరుపేదల ఇంటి వద్దకు తీసుకెళ్లేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చే దిశగా సిబ్బంది పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారుల జాబితాను పథకాల వారీగా నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. సచివాలయ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందని అర్హులైనవారు ఎవరైనా ఉంటే వారి అర్హతను అనుసరించి ఆయా పథకాలకు దరఖాస్తు చేయించేలా వాలంటీర్ల ద్వారా చర్యలు తీసుకోవాలని జెసి తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, పురపాలక సంఘం కమీషనరు సిహెచ్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - యలమంచిలి

డివైఎఫ్ఐ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా జెండాలను ఆవిష్కరించారు. చించినాడ గ్రామం అరుంధతిపేట వద్ద సంఘం జిల్లా కమిటీ సభ్యులు తెన్నేటి స్టాలిన్, విప్పర్తిపేట వద్ద మురాల రాజేష్ జెండాను ఆవిష్కరించారు. జిల్లా పూర్వపు నాయకులు కానేటి బాలరాజు మాట్లాడుతూ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, అబద్ధపు ప్రచారంతో బిజెపి కేంద్రంలో అధికారం చేపట్టిందని, ఇన్నేళ్లయినా బిజెపి ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోకుండా గాలికొదిలేయడం చూస్తుంటే చాలా ఆవేద కలిగిస్తుందని తెలిపారు. ఇటువంటి వారికి భవిష్యత్తులో గుణపాఠం చెప్పడానికి, రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడానికి యువతీ యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు విప్పర్తి అవినాష్, విప్పర్తి రమేష్, మురాల జైసింగ్, ముస్కుడి సామ్యూల్ రాజు, ఎస్.నరసింహ, ముస్కుడి విజయకుమార్, భూతుల రాజేష్, డివైఎఫ్ఐ మాజీ నాయకులు దేవ సుధాకర్, బాతిరెడ్డి జార్జి, ముమ్మిడివరపు అంజనేయులు పాల్గొన్నారు.

నిలిచిన విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడిపి హయాంలో ప్రారంభించిన 48 బిసి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం సగంలో నిలిచిపోయాయని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు 18వ వార్డులోని నాయీ బ్రాహ్మణుల కళ్యాణ మండపానికి కనకమేడల రవీంద్ర ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలతో పనులను శుక్రవారం ఎంఎల్ఎ నిమ్మల పున్న ప్రారంభించారు. గత మూడున్నర ఏళ్లలో బిసి కార్పొరేషన్ నుంచి ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదని చెప్పారు. పాలకొల్లులో వివిధ పనులకు రవీంద్ర రూ.2 కోట్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో జివి సంఘ నేతలు పాల్గొన్నారు.

బల్లిపాడులో పొలంబడి

అత్తిలి: బల్లిపాడులో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ రాజేష్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రతి రైతూ కనీసం వారు తినడానికైనా అరెకరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆహారం పండించుకుని తీసుకోవాలని చెప్పారు. రైతులు రసాయన ఎరువులు స్ప్రే చేస్తుండగా తగు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ అధికారి జిల్లా కోఆర్డినేటర్ జెడ్ రత్నాజీ మాట్లాడుతూ బయోకల్చర్‌లో వెట్టి సెల్లియం కాలనీ, టెర్మాడెర్మా విరిడి ఈ కల్చర్ చూడు దోమకు, మెడ ఎరుపుకు బాగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కాశిరెడ్డి బాలాజీ, తణుకు డివిజన్ ఇన్‌ఛార్జి మధుసూదన్‌రావు, ఐసిఆర్‌పి గంగాధర్, ఉషారాణి, నాగలక్ష్మి రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ సూర్యతేజ

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

సబ్‌కలెక్టర్ సూర్యతేజ

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నేడు అవకాశాలు మెండుగా ఉన్నాయని, విద్యార్థులు కృషి పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సబ్ కలెక్టర్ మల్లవరపు సూర్యతేజ తెలిపారు. శుక్రవారం వైఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సబ్‌కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పూర్వ కాలంతో పోలిస్తే జీవితంలో ఎదగడానికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఎవరికి వారు గోల్ ఏర్పరచుకోవాలన్నారు. దాన్ని సాధించడం కోసం పట్టుదలతో కృషి చేయాలన్నారు. మన డ్రీమ్స్ ఉన్నతంగా ఉండాలని, వాటిని రియాల్టీగా మార్చుకోగలిగేలా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి కళాశాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణ రావు కళాశాలలో విద్యార్థులకు కలిపిస్తున్న మౌలిక సదుపాయల గురించి, రీసెర్చ్‌కు ఇస్తున్న ప్రాధాన్యత గురించి సబ్ కలెక్టర్‌కు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎపివి అప్పారావు, ఎంబిఎ హెచ్‌ఒడి ఆర్.పార్థసారధి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సబ్ కలెక్టర్ సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి పోలిశెట్టి శ్రీరఘురామారావు, జాయింట్ సెక్రటరీ అందే రామసతీష్, కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్స్ చేగొండి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తలకు బీమా

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జనసేనలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ పార్టీ జీవిత కాల బీమా కల్పిస్తోందని జనసేన నియోజకవర్గ కన్వీనర్ బొమ్మిడి నాయకర్ తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మొగల్తూరు మండలం పేరుపాలెం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు బల్ల రాంబాబుకు గురువారం రూ.50 వేల ప్రమాద బీమా చెక్కును ఏలూరులో జరిగిన కార్యక్రమంలో నాదెండ్ల మనోహర్ అందించినట్లు ఆయన తెలిపారు. ప్రతి కార్యకర్తకూ భరోసా కల్పించాలనే ఉద్దేశంతో అధినేత పవన్ కళ్యాణ్ బీమా సౌకర్యం కల్పించారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జక్కం బాబ్జి, వలవల నాని, బందెల రవీంద్ర, ఆకన చంద్రశేఖర్, తోట నాని, పులి భుజంగరావు, లక్కు బాబి, ఎడ్లపల్లి మహేష్ పాల్గొన్నారు.

మొగల్తూరు : ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురైన పేరుపాలెంకు చెందిన బళ్ల రాంబాబుకు జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకునందున ప్రమాద బీమా కింద రూ.50 వేల చెక్కును జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఏలూరులో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్, జక్కం బాబ్జి, వలవల నాని పాల్గొన్నారు.

పూలపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ట్రయల్ రన్ కార్యక్రమం పూలపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ వైద్యసేవలందించారు. జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ వరప్రసాద్ సందర్శించి వైద్య సేవలు ఎలా అందుతున్నాయి, పరీక్షలు ఏవిధంగా చేస్తున్నారని పరిశీలించారు. అనంతరం డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎల్‌హెచ్‌పి ఎఎన్ఎం, ఆశాలు వైద్య సేవలందిస్తారని తెలిపారు. 24 రకాలు పరీక్షలు, 67 రకాల మందులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూలపల్లి హైస్కూల్, వృద్ధాశ్రమాన్ని సందర్శించి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పి.వెంకటనారాయణ, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - పోడూరు

అవినీతి నిర్మూలించి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పాలకొల్లు ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ ఎస్.రఘుకుమార్ పిలుపునిచ్చారు. అవినీతి వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిన్నూరు పంచాయతీ కార్యాలయంలో ఎల్ఐసి ఇండియా వారి ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సులో బ్రాంచి మేనేజర్ రఘుకుమార్ మాట్లాడుతూ సమాజంలో అవినీతిని పూర్తిగా రూపుమాపినప్పుడే దేశం అన్ని రంగాల్లోనూ పురోగతి సాధిస్తుందన్నారు. పాలకొల్లు బ్రాంచి పరిధిలోని 5 మండలాల్లో అవినీతి నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ త్రిమూర్తులు మాట్లాడుతూ నేటి యువత పొదుపు వైపు మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్ గ్రంధి శ్రీనివాసరావు, ఎల్ఐసి ఏజెంట్లు పి.రాము, జక్కంసెట్టి రామప్రసద్ పాల్గొన్నారు.

తేగలొచ్చేశాయ్..

ప్రజాశక్తి - పెనుమంట్ర

తాటి తేగలంటే చాలా మంది ఇష్టంగా తింటారు. ఏటా ఈ సీజన్‌లో ఎక్కువగా ఇవి లభిస్తాయి. వీటిలో పోషకాలు మెండుగా ఉంటాయి. నోరూరించే తేగలు, బుర్ర గుంజులు ప్రస్తుతం మండల పరిధిలోని మార్టేరు, బ్రాహ్మణ చెరువు, ఆలమూరు, నత్తారామేశ్వరం గ్రామ కూడలిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. పొలాల వద్ద తాటిచెట్లు ముందు పడిన తాటికాయలను రైతులు పోగు వేసుకుని గుంత తీసి వాటిలో తాటికాయలను వేసి మట్టి వేస్తారు. మూడు నుంచి నాలుగు నెలల తర్వాత దీపావళి, చవితి రోజులకు తేగలుగా మారతాయి. వాటిని శుభ్రం చేసి కాల్చుతారు. అనంతరం వాటిని విక్రయిస్తారు. ఉభయగోదావరి జిల్లాల్లో ఇవి ఎక్కువగా లభిస్తాయి. మార్టేరుకు చెందిన గుత్తుల నాగన్న రైతుల నుంచి వాటిని కొనుగోలు చేసి జత రూ.10లకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న తేగలు

ఇచ్చిన హామీ అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ ప్రజలకు గోదావరి నీటిని పైప్‌లైన్ల ద్వారా అందిస్తామన్న ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఇచ్చిన హామీ అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం మండల కమిటీ సభ్యుడు షేక్ పాదుషా అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరంగనాథరాజు ప్రచారంలో భాగంగా పెనుగొండ వాసులకు గోదావరి నీరు అందిస్తానని హామీ ఇచ్చారని, అది నేటి వరకూ కార్యరూపం దాల్చలేదని తెలిపారు. తక్షణం మండల ప్రజలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన తాగునీరు అందించాలని కోరారు. గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థను రూపొందిస్తానని ఇచ్చిన హామీ కూడా అమలు కాలేదన్నారు. పెనుగొండ కోడిపందేల దిబ్బ ప్రాంతంలో నివసించే వందలాది కుటుంబాలకు తాగునీరు అందించడంలో, డ్రెయినేజీ, పేదలకు పక్కా ఇళ్లు నిర్మించడంలో విఫలమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, మన్నే వెంకటేశ్వరరావు, శీలం ఏసు, నీలాపు ఆదినారాయణ, కప్పల రత్నరాజు, వేడంగి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

పాడి రైతులు గోకుల మిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పాడి రైతులు రాష్ట్ర గోకుల మిషన్ ద్వారా ఆడ దూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెనుమంట్ర, ఆలమూరు వెటర్నరీ వైద్యులు జి.రవికాంత్, వరలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మేలు జాతి లింగ నిర్ధారిత వీడియో ఉపయోగించడం ద్వారా ఆడ దూడలను ఎక్కువ ఉత్పత్తి చేసి పాల దిగుబడి పెంచుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను దృష్టిలో పెట్టుకొని ఆడ దూడల ఉత్పత్తి పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకాన్ని ఈ నెలలోనే ఆరంభమైనట్లు తెలిపారు. రైతుల ఆదాయం మెరుగుపడుతుందనే ఉద్దేశంతో కృత్రిమ గర్భాధారణ ద్వారా మేలు జాతి పురుష సంపద వృద్ధి కావడం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. గ్రామంలోని పశువులను ఎంపిక చేసి మేలు జాతి పశువుల్లో 30 నుండి 40 పశువులను గుర్తించి రైతులతో కలిసి పశువులను సూడి కట్టించడం ద్వారా 25 శాతం ఆడ దూడలు పుట్టించే అవకాశం ఉందన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్క పశువుకు రూ.850 రాయితీ వర్తిస్తుందన్నారు. ఒక్కొక్క కృత్రిమ గర్భధారణకు రూ.675 గల లింగ నిర్ధారణ వీర్య నాళికలను ఈ రెండు పర్యాయాలు వినియోగిస్తామన్నారు. దీనిపై పాడి రైతులకు రాయితీ అందిస్తామన్నారు. రెండు వీర్య నాళికల ధర రూ.1350 అయితే, రైతు చెల్లించాల్సింది ఒక్కో పశువుకు రూ.500 అని తెలిపారు. మిగిలినది ప్రభుత్వ రాయితీ కింద రూ.850 భరిస్తుందన్నారు. ఒకవేళ రెండు పర్యాయాలు కృత్రిమ గర్భధారణ తర్వాత కూడా పశువు గర్భం దాల్చకపోతే రైతు చెల్లించిన మొత్తం తిరిగి వెనక్కి ఇస్తామన్నారు. ఒకవేళ మొదటిసారి కృత్రిమ గర్భాధారణ మగ దూడ పుట్టినట్టయితే డబ్బు వాపసు ఇవ్వడం జరుగుతుందన్నారు. రెండోసారి కూడా మగదూడ పుడితే రూ.250 తిరిగి వాపసు ఇస్తామన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఒ రాజేష్

శశిలో జాతీయ స్థాయి ప్రాజెక్టు ప్రదర్శన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం వైజాగ్ ఐఇఇఇ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ప్రదర్శన నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మొహమ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. వివిధ రాష్ట్రాల ఇంజినీరింగ్ కళాశాలల నుండి 240 మంది విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనను చూడడానికి, సాంకేతిక విషయాలు తెలుసుకోవడానికి తాడేపల్లిగూడెం, వివిధ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మంది స్కూల్ విద్యార్థులు పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఇలాంటి ప్రాజెక్ట్‌లను సందర్శించడం ద్వారా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవచ్చన్నారు. కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, వైజాగ్ చాప్టర్ ప్రెసిడెంట్ లక్ష్మీ నారాయణ మాట్లాడారు. శశి ఇంజినీరింగ్ కళాశాల అందిస్తున్న సాంకేతిక ప్రోత్సాహాన్ని, విద్యార్థుల కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల ప్రాజెక్టులను ఎన్ఐటిల నుండి వచ్చిన ప్రొఫెసర్లు వి.సందీప్, నగేష్ బసు, కార్తికేయ శర్మ పరిశీలించి విజేతలను ప్రకటించారు. అనంతరం విజేతలకు, వివిధ కళాశాల విద్యార్థులకు వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ ప్రశంసా పత్రాలు, రూ.50,000 నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.భానుప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, కోఆర్డినేటర్ పి.శివకుమార్, ఎ.అశ్విన్, హేమ చందు పాల్గొన్నారు.

ఎన్‌క్యూఎఎస్‌కు పెనుమంట్ర పిహెచ్‌సి ఎంపిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర పిహెచ్‌సి నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ సర్వీస్ (ఎన్‌క్యూఎఎస్) ఎంపికైనట్లు డాక్టర్ కె.లావణ్య, వై.అనూష తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ప్రతిరోజు 70 నుండి 80 మందికి వివిధ పరీక్షలు చేసి, నెలకు 9 నుండి 12 సులభ ప్రసవాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మే 23, 24 తేదీల్లో ఎన్‌క్యూఎఎస్ సెంట్రల్ టీం పరిశీలించిందని తెలిపారు. రోగులకు ఇస్తున్న మౌలిక సదుపాయాలు, ఆపరేషన్ చేసే విధానం, ఇతర అంశాలను పరిశీలించారని తెలిపారు. ఆసుపత్రి వెనుక భాగంలో రూ.3 లక్షలతో షెడ్డును ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) మండల పరిషత్ నిధులతో నిర్మించారని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో పార్కింగ్, ఉద్యానవనం తలపించే విధంగా ఇతర పనులు, రోగుల కోసం ఫర్నీచర్ సౌకర్యం కల్పించారని తెలిపారు. పిహెచ్‌సి ఎన్‌క్యూఎఎస్ ఎంపిక కావడం పట్ల ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) హర్ష వ్యక్తం చేశారు.



పెనుమంట్ర పిహెచ్‌సి

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి : సిఐ

ప్రజాశక్తి - తణుకు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తణుకు సిఐ ముత్యాల సత్యనారాయణ అన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు లైసెన్స్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలోని నరేంద్రసెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించి పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సరైన వాహనపత్రాలు లేని వారి నుంచి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించిన వారి నుంచి జరిమానాలు వసూలు చేశారు. ఈ తనిఖీల్లో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ జానా సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

మురళీకృష్ణకు మాతృ వియోగం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాత్రికేయులు, మిమ్మిక్రీ కళాకారులు సరిదే మురళీకృష్ణకు మాతృ వియోగం జరిగింది. పాలకొల్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విశ్రాంత ఉద్యోగిని సరిదే అప్పాయమ్మ (89) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆమెకు ఐదుగురు అమ్మాయిలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె మృతి పట్ల పాలకొల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కెవిఎస్ఎల్ఎన్ రాజు, కార్యదర్శి లాజరస్, కోశాధికారి తోట రాంబాబు సంతాపం తెలిపారు.

స్థిర, చరాస్తులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - ఆచంట

ప్రజల తమ స్థిర, చరాస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వల్ల ప్రభుత్వపరంగా చట్టబద్ధత కలుగుతుందని ఆచంట సబ్ రిజిస్ట్రార్ కమల కుమారి తెలిపారు. శుక్రవారం ఆచంట పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు అధ్యక్షతన రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ఆధ్వర్యంలో స్థిర చరాస్తుల పరిరక్షణ, చట్టబద్ధతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందన్నారు. ఇవి కాకుండా అగ్రిమెంట్ల ద్వారా గాని, మూజువాణి ఒప్పందం ఎట్టి పరిస్థితుల్లోనే ఇవ్వకూడదన్నారు. రిజిస్ట్రేషన్ అయితే పుట్టుపూర్వోత్తరాలు తేట తెల్లంగా కనిపిస్తాయన్నారు. లక్షల్లో కొనుగోలు చేసి వేలల్లో రిజిస్ట్రేషన్లు అవుతాయని, అటువంటి అపోహలు వీడి తమ ఆస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయించుకుని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, రిజిస్ట్రేషన్లు సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, లేఖర్లు రైతులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని ఆర్యపేట గ్రామానికి చెందిన జడ్డు సుబ్బయ్యపై 2016 సంవత్సరంలో దాడిచేసిన కేసులో యలమంచిలి గ్రామానికి చెందిన తమ్మినీడి నాగేశ్వరరావు, తమ్మినీడి పృథ్వికి జైలు శిక్ష విధిస్తూ నరసాపురం న్యాయస్థానంలో శుక్రవారం తీర్పు వెలువడినట్లు ఎస్ఐ జెవిఎన్.ప్రసాద్ తెలిపారు. తమ్మినీడి నాగేశ్వరరావుకు ఆరు నెలలు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా, తమ్మినీడి పృథ్వికి సంవత్సరం జైలు శిక్ష, మూడు వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గౌరీశంకర్ తీర్పునిచ్చారని ఎస్ఐ తెలిపారు.

లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే చర్యలు


ప్రజాశక్తి - పెనుగొండ

లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎస్ఎన్‌వివి.రమేష్ అన్నారు. శుక్రవారం ఎస్‌వికెపి సెంటర్ వద్ద డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం, మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారిపై తనిఖీలు నిర్వహించారు. అనంతరం వారిచేత లైసెన్స్ కోసం స్లాట్స్ బుక్ చేయించి వారి వాహనాలు వారికి అప్పచెప్పారు. అలాగే మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారి పేరెంట్స్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. తప్పకుండా బయటకు వచ్చినప్పుడు లైసెన్స్ వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

'టిడిపి విజయం తెలుగు యువతోనే సాధ్యం'

ప్రజాశక్తి - వీరవాసరం

రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం తెలుగు యువత పని తీరు పైనే ఆధారపడి ఉందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. భీమవరం నియోజకవర్గ విస్తృస్థాయి సమావేశం, తెలుగు యువత ప్రమాణస్వీకారోత్సవం శుక్రవారం వీరవాసరంలో నిర్వహించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ధర్మేంద్ర అధ్యక్షతన జరిగిన సభలో రామానాయుడు మాట్లాడుతూ సిఎం జగన్ రాక్షస పాలన ఈ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. జాబ్‌క్యాలండర్ అమలు చేస్తానన్న జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చి మాట తప్పడంతో రాష్ట్రంలో యువత అసంతృప్తిగా ఉన్నారని, దీనిని అవకాశంగా తీసుకుని తెలుగు యువత వారిని టిడిపి వైపు తిప్పుకునే విధంగా పని చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు వేయగలిగే పరిస్థితి ఉంటే విజయం టిడిపిదే అన్నారు. ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ బిసి పక్షపాతిగా చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం రోజకో బిసి నాయకుడిపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారంటూ విమర్శించారు. నిరాధారమైన కుట్రలతో టిడిపి నాయకులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అనంతరం భీమవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడుగా వీరవాసరం చెందిన కముజు హరిబాబు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి విజయానికి యువతను సమీకరించి వచ్చే ఎన్నికలలో చంద్రబాబును సిఎంగా చూసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మీ, పార్టీ రాష్ట్ర కోశాధికారి కోళ్ల నాగేశ్వరరావు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, టిడిపి మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, కార్యదర్శి వీరవల్లి శ్రీనివాసరావు, వీరవల్లి చంద్రశేఖర్, రాయపల్లి వెంకట్, గొర్రె కృష్ణమూర్తి, నేతలు పాల్గొన్నారు.



తెలుగు యువత భీమవరం నియోజవర్గ అధ్యక్షుడు హరిబాబును అభినందిస్తున్న నిమ్మల రామానాయుడు